

ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

# శ్రీ సాయి లీలామృతము

## అధ్యాయము - 9



## ఉపదేశాలు ।

ఇహపర శ్రేయస్సుకు సద్గురువును సేవించి, ఆయన అనుగ్రహానికి పాత్రులవడమే ముఖ్యం. ప్రాయశ్చిత్త మేలేని మహా పాపాలకు గూడ సద్గురుసేవే తరుణోపాయమని ధర్మశాస్త్రం చెబుతుంది. కనుక ప్రజలలో ఎక్కువ మందికి అదొక్కటే తరుణోపాయం. మరలా సాధన చివరిదశలో ఆత్మనిష్ఠుడు, శ్రోత్రియుడూ అయిన జ్ఞానిని ఆశ్రయించితీరాలని శాస్త్రం.

అటువంటి గురువులలో ఉత్తములు శ్రీసాయిబాబా. ముముక్షువు ఎలాటి గురువు నాశ్రయించాలో, ఎలా సేవించాలో ఒకప్పుడు సాయి ఆచరించి చూపారు. ఈ విషయమే మరలా తిరిగి చిత్రమైన రీతిన, ఉత్తమమయిన తమ బోధగా, శ్యామాచేత చెప్పించారు. ప్రపంచంలోని అన్ని మతాల ఆధ్యాత్మిక సాంప్రదాయాల, మహనీయుల, అనుభవాలసారమంతా అందులోనే వున్నది.

సాఠే అను పెద్దవ్యాపారి ఒకప్పుడెంతో నష్టపోయి యిల్లువిడచి పోవాలని తలచాడు. స్నేహితుల సలహాపై 1911లో సాయి సన్నిధిలో కొద్దిరోజులున్నాడు. అపుడు "శ్రీ గురుచరిత్ర" ఒక సప్తాహం పారాయణ చేశాడు. నాటిరాత్రి ఆ గ్రంథాన్నే చేతబట్టుకుని సాయి స్వప్న దర్శనమిచ్చి, దానిని గురించి యేమో చెప్పారు. మరుసటి ఉదయమే దాని భావమేమని అతడు కాకాసాహెబ్‌చేత బాబాను అడిగించాడు. అతడింకొక పారాయణ చేయాలని ఆయన వివరించారు. అది వినిన హేమాద్పంతు, తాను 40 సం॥లుగా పారాయణ, 7 సం॥ల నుండి సాయిసేవ చేస్తున్నా లభించని కృప సాఠేకు అంత త్వరగా లభించిందే అని కలతచెందాడు. వెంటనే అతనిని లేపి, "శ్యామా వద్దకు వెళ్ళి అతనివద్ద రూ. 15/-లు దక్షిణ తీసుకొని, అతనితో కొద్దిసేపు మాట్లాడిరా!" అని బాబా ఆదేశించారు.

హేమాద్పంతు వెళ్ళేసరికి శ్యామా పూజకు కూర్చుంటున్నాడు. అక్కడ వున్న ఏకనాథ భాగవతం చూడగానే, తానారోజు పారాయణ చేయలేదని గుర్తొచ్చింది. దానిని తెరవగానే ఆ రోజు చదవవలసిన భాగమే వచ్చింది! తననందుకే బాబా పంపారని తలచి పారాయణ పూర్తిచేసాడు హేమాద్పంతు. ఇంతలో శ్యామాగూడ పూజ పూర్తి చేసుకుని వచ్చాడు. బాబా తననుంచి దక్షిణ కోరారని విని, "నావద్ద పైకంలేదని ఆయనకు తెలుసు! నా 15 నమస్కారాలే దక్షిణగా సమర్పించు. సరేగాని, నీవంటి విద్యావంతుణ్ణి నా మాటలు వినడానికెందుకు పంపారో! అయినా, ఆయన స్ఫురింపజేసిన లీల చెప్తాను:

'సంగమనేర్ నుండి వచ్చిన రాధాబాయి, తాను కోరకనే సాయి తనకు ఉపదేశమిస్తేగాని, అంతవరకూ అన్నం తిననని నిశ్చయించుకొన్నది. మూడవరోజు ఆమెకేదైనా హితం చెప్పమని సాయిని కోరాను. బాబా ఆమెను పిలిపించి యిలా చెప్పారు: 'అమ్మా, వ్యర్థంగా నిన్ను నువ్వు బాధించుకోకు. నా వృత్తాంతం విను. నీకెంతో ఉపకరిస్తుంది. నా గురువు గొప్పయోగి, దయామయుడు. వారినుండి ఉపదేశమాశించి 12 సం॥లు సేవించాను. కాని ఆయన నాకే మంత్రమూ ఉపదేశించలేదు; నా తల బోడిచేయించి రెండు పైసలు దక్షిణ కోరారు. ఆయన

కోరినది ధనంకాదు; మొదటి పైస నిష్ఠ, అంటే స్థిరమైన విశ్వాసం; అది సమర్పించాను. ఆ ప్రేమ మూర్తి ఎప్పుడూ ధ్యానంలో వుండేవారు. ఆయనను చూస్తూనే నేను ఆనందంలో మునిగి ఆకలి దప్పులు గూడా మరిచాను. ఆయనను మరచి నాకు శాంతి ఉండేదికాదు. నా మనస్సు వారియందే నిలిచింది. అంత కాలమూ నాకు అన్నవస్త్రాలకు లోటులేదు. ఈ ప్రేమయే, విశ్వాసమే, నేను సమర్పించిన మొదటి పైస. ఆయన కోరిన రెండవపైస సబూరి, అంటే సంతోషము-పట్టుదలతో కూడిన ఓరిమి. అది సర్వ పాపాలను, కష్టాలనూ తొలగించి విజయాన్నిస్తుంది. సర్వ సద్గుణాలకు నిధి. విశ్వాసానికి సోదరి. నేను దీనిని సమర్పించాను. ఆయన కృపకోసం వేచి వున్నాను. ఆయన తమ మనోదృష్టిని నాపై నిలిపి నన్నుద్ధరించారు. నా యత్నమేమీ లేకనే వారి కృపవలన నాకీస్థితి కలిగింది. ఆయన నాకే మంత్రమూ ఉపదేశించనపుడు, నేను నీకెలా ఉపదేశిస్తాను? మంత్రముగాని, మరే ఉపదేశంగాని ఎవరివద్ద నుంచీ పొందవద్దు. నన్ను గురించి సదా ప్రేమతో చింతన చేస్తూండు. నేనూ నీపై దృష్టి నిలుపుతాను. అలాచేస్తే నీకు పరమార్థం తప్పక లభిస్తుంది. మశీదులో కూర్చొని నేనెన్నడూ అబద్ధం చెప్పను. వేరే సాధనగాని, శాస్త్ర విజ్ఞానంగాని అవసరం లేదు. పూర్ణ విశ్వాసమూ, ఓరిమి కల్గివుండు. గురువే దైవం. ఆయనే సర్వమూ సమకూర్చగలడు.'

ఈ కథ వినడంతోనే హేమాద్పంతుకు పట్టరాని ఆనందంతో కంఠం గద్గదమై, నేత్రాలు ఆనందభాష్పాలతో నిండి, శరీరమంతా రోమాంచితమైంది. ఇంతలో గంటలు విన్పించి, మధ్యాహ్న ఆరతికి ఇద్దరూ మశీదు చేరారు. భక్తులు చేతులు తడుతూ మేళతాళాలతో ఆరతి పాడుతున్నారు. పంత్‌ను చరచరా లాక్కుపోయి సాయికి కుడిప్రక్కగా శ్యామా కూర్చున్నాడు. పంత్ ఎదురుగా కూర్చున్నాడు. సాయి వారు చెప్పిందంతా విని, "అర్థమైందా?" అన్నారు. "అర్థమైంది, నా చిత్తం శాంతించింది, సరైన మార్గం తెలిసింది" అన్నాడు పంత్.

"నా పద్ధతి అత్యాశ్చర్యకరము. ఈ ఒక్క సంఘటనా గుర్తుంచుకొంటే చాలు" అని బాబా దాని సారాంశమిలా చెప్పారు; "ఆత్మజ్ఞానానికి నిరంతరం ధ్యానమవసరం. ధ్యానం వలన మనస్సు స్థిరమౌతుంది. సర్వగతుడైన ఈశ్వరునియందు మనస్సు నిలపటమే పరమార్థం. ఇది కుదరకపోతే నా ఆకృతిని నఖశిఖ పర్యంతమూ అహర్నిశలూ నీ మనస్సులో నిలుపుకో! నీ మనస్సు ఆ ఒక్క రూపాన్నే పొందుతుంది. ధ్యానించే నీవు, ధ్యానింపబడే నేను, ధ్యానమనే క్రియా వేరుగా అనుభవమవక, సర్వగతమైన చైతన్యమే అనుభవమవుతుంది" అన్నారు. ఇంతలో ఆరతి పూర్తయి భక్తులంతా జయజయధ్వానాలు చేశారు. పంత్ చేతిలో ప్రసాదముంచుతూ బాబా, "అలా చేస్తే నీ స్థితి కూడా ఈ ప్రసాదంలాగా మధురమై సర్వార్థసిద్ధి లభిస్తుంది" అన్నారు. ఈ లీలగూర్చి హేమాద్పంత్ యిలా అంటాడు : "నా మనసులో అశాంతిని రేకెత్తించి, నన్ను శ్యామా యింటికి పంపి, నాటి పారాయణ పూర్తి చేయించి, శ్యామానోట ఈ లీలను సాయియే చెప్పించారు."

నిజమైన గురువెలావుంటాడో తెలుసుకోవడం మన మొదటి కర్తవ్యం. అందుకే ఒకప్పుడు సాయి అన్నారు: "సద్గురువును తెలుసుకోవాలి. లేకపోతే ఎందుకొచ్చినట్లు, పిడకలు ఏరుకోడానికా?" మానవుడు జన్మకొచ్చింది సద్గురు కృపతో మృత్యువును జయించడానికే. సద్గురు లక్షణాలీ వృత్తాంతంలో యిలా కన్పిస్తాయి. శ్రోత్రియుడు, బ్రహ్మనిష్ఠుడు అయినవారినే సేవించాలని వేదాలు చెబుతున్నాయి. తత్త్వదర్శినే సేవించాలని శ్రీకృష్ణుడు (భగవద్గీత 4 : 34) చెప్పాడు. వశిష్ఠుని ఆశ్రయించక విశ్వామిత్రుడు గూడ బ్రహ్మర్షిగాలేదు. రాముడు తన ఆచరణద్వారా అదే తెలిపాడు. 'శ్రీ గురుగీత' అట్టివాడే గురువని చెబుతుంది. అందుకే, 'నిజమైన ఫకీరు చాలా అరుదు' అని సాయి అన్నారు.

సాయి సేవించిన ఆ గురువులాగ, సాయిబాబాలాగ, అక్కల్కోట స్వామి, రమణమహర్షులలాగ సద్గురువు

ఎవరినీ తమ శిష్యులని తలచరు. సర్వాన్నీ ఆత్మగానే దర్శిస్తారు. సాయి అందరినీ 'భావూ' (సోదరా) అంటే, రమణమహర్షి ప్రతిజీవినీ 'వారు' అనేవారు. అందువలన వారు ఎవరికీ ఏ మంత్రమూ ఉపదేశించరు. ఆధ్యాత్మ ప్రచారము, శిష్యసేకరణ, గ్రంథరచన, ఆలయ, మఠ, ఆశ్రమ నిర్మాణ నిర్వహణలు చేయరు. ముముక్షువే వారిని గురువుగా విశ్వసించి, ప్రేమమూర్తిగా ధ్యానించి, సేవించి తరించాలి - సాయి చేసినట్లు. అందుకే ఎవరివద్దా ఉపదేశం కోసం ప్రాకులాడవద్దని ఆయన హెచ్చరించారు.

అటువంటి గురువు దొరికాక ఆయనను నిష్ఠ, సబూరీలతో సేవించాలి.

ఒకసారి బాపూసాహెబ్‌జోగ్ మశీదులో కూర్చుని, "సద్గురువు శిష్యుణ్ణి తనంతటివాడుగా చేస్తాడంటారు. సాయి నన్నింకా అలా చేయలేదే" అనుకున్నాడు. వెంటనే ఆయన నవ్వుతూ అతనిని చూపి, "వీడు నా స్థానమాక్రమించాలని చూస్తున్నాడు!" అన్నారు. మరొకప్పుడతడే ఆయన పాదాలొత్తుతూ, "బాబా, నా సేవ పూర్తియైనట్లు గుర్తేమి?" అన్నాడు. "నీవూ సర్వబంధాలూ విడిచి, భిక్షువై నాలా జీవించడమే!" అన్నారు సాయి. అంటే జీవిత విధానమంతా ఆయనలాగా నిర్వహించగలవాడే గురువు. ముక్తుడైనవాడేగదా యితరుల నుద్ధరించగలడు? అట్టివారంతా పూర్ణత్వం చెందకముందు లోకానికి వెల్లడిగారు. అకాలంలో పుట్టిన శిశువు సంపూర్ణమెలా అవుతుంది? పిందె కోస్తే పండెలా అవుతుంది?

బాబా చెప్పిన గురుసేవా వృత్తాంతంలో సామాన్యంగా వేర్వేరని తలచబడే ధర్మంలో (మార్జాలకిశోర న్యాయము, మర్కటకిశోర న్యాయము) గురుశిష్య సంబంధాలు రెండూ మేళవించబడి వున్నాయి. శ్రీసాయివలె నిష్ఠ, సబూరీలతో గురువునంటిపెట్టుకోగలవాడే శిష్యుడు. ఆయన గురువువలె కేవలం తమ మనోదృష్టితోనే భక్తుణ్ణి సదా కాపాడి పూర్ణుణ్ణి చేయగలవాడే గురువు. సాయివంటి గురువు లభించాక సకల శాస్త్రాల సారము భక్తులకు లీలల రూపంలో అనుభవమవుతుంది. ఈ కాలంలో అలాంటి "నిజమైన ఫకీరు చాలా అరుదు" అని --సాయియే చెప్పారు. మనకై మనంగా గాని, ఆత్మజ్ఞానం లేనివారివద్దగాని, శాస్త్రాలు చదివితే (మనకెంతో తెలుసునన్న) గర్వం వచ్చి, సద్గురువును ఆశ్రయించ లేకపోతాము -- ఉపాసనీబాబా లాగా, 'శ్రీ గురుచరిత్రలోని' త్రివిక్రమ భారతి లాగా, కేవలం పూర్వపుణ్యంవలన దానిని సద్గురువు తొలగించవలసిందే. ఇందుకొక ఉదాహరణ; భగవద్గీత చక్కగా చదువుకొన్నవాడని నానాచందోర్కర్‌ను అందరూ గౌరవించేవారు. సాయి సన్నిధిలో తన మనసులో వికారాలు తలెత్తకుండా అతడు భగవద్గీత వల్లించుకునేవాడు. ఒకసారి అతడు వల్లిస్తున్న శ్లోకం పైకి చదివి అర్థం చెప్పమన్నారు బాబా.

అపుడతడు 4వ అధ్యాయంలోని 34వ శ్లోకం --

తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।

ఉపదేక్ష్యన్తి తేఽజ్ఞానం జ్ఞానినస్తత్వదర్శినః ॥

-- చదివి 'గురువులకు సాష్టాంగ నమస్కారము, సేవచేసి ప్రశ్నించు; అపుడా బ్రహ్మజ్ఞానులు నీకు జ్ఞానముపదేశిస్తారు' అని దాని అర్థం చెప్పాడు. అప్పుడు సాయి అతనినిలా అడిగారు:

సాయి : పాతమంటే నమస్కారమే అయితే, మరల 'ప్రణి' అని, 'ప్రశ్న'అనకుండా 'పరిప్రశ్న' అనీ అనడమెందుకు?

నానా : నాకు తెలిసిన అర్థమదే !

సాయి : సేవ అంటే ఏమిటి?

నానా : మేమెప్పుడూ చేసేదే.

సాయి : జ్ఞానమనే పదానికి బదులు యింకేదైనా చేర్చవచ్చా?

నానా : 'అజ్ఞానం'(జ్ఞానం) అని చదివితే ఛందస్సు సరిపోతుందిగాని, భాష్యాలేవీ అలా వివరించలేదు.

సాయి : అయితేనేమి? అంతకంటే మంచి అర్థమొస్తే అలానే చదువవచ్చుగదా! అర్థమెలా సరిపోతుందో చెబుతాను! పరబ్రహ్మ స్వరూపమైన కృష్ణుడు యితర జ్ఞానులను సేవించమని అర్జునునికి చెప్పడమేమిటి?

నానాకేమీ తెలియలేదు. అతని విద్యాగర్వం అణిగింది. అపుడు సాయి ఆ శ్లోకాన్ని యిలా వివరించారు: "గురువుకు నమస్కారం చేస్తే చాలదు, ఆత్మ సమర్పణ చేసుకోవాలి. అదే ప్రణిపాతమంటే. బుద్ధి పుట్టినపుడు మాత్రమే సేవచేయడంగాక, తన శరీరం గురుసేవకోసమే వున్నదని, దానిపై తనకెట్టి అధికారమూ లేదనీ తలచి చేసినదే సేవ. అట్టివాడే శిష్యుడు. అతడు కేవలం మోక్షంపై కోరికతో, యోచనతో అడిగి సందేహ నివృత్తి చేసుకోవడమే పరిప్రశ్న.

వెలుగంటే చీకటిని పారద్రోలడమే; జ్ఞానమంటే అజ్ఞానాన్ని తొలగించడమే. శిష్యుడు సహజంగా జ్ఞాన స్వరూపియేగాని అతడే జీవుడనని, శరీరమే తాననీ తలచి సుఖదుఃఖాలకు, కర్మబంధాలకూ లోనవుతాడు. జ్ఞానం అనుభవంతో మాత్రమే కల్గుతుందిగాని మాటలకు, ఊహలకు అందదు. కనుక దానిని వాచా బోధించడం సాధ్యంకాదు. కాలులో గ్రుచ్చుకున్న ముల్లును మరో ముల్లుతో తీసినట్లు, పాత్రకు పట్టిన మసిని మట్టితో రుద్ది పోగొట్టినట్లు, గురువు తన బోధయనే సాత్వికమైన అజ్ఞానంతో శిష్యుని అజ్ఞానం తొలగిస్తాడు. అప్పుడు శిష్యునిలో దాగివున్న జ్ఞానం శిష్యునికే అనుభవమవుతుంది. కనుక గురువు వాచా బోధించేది గూడా అజ్ఞానమే. సర్వమూ దైవస్వరూపమని, తత్వద్రష్టలందరూ ఆ భగవంతుని రూపాలేననీ సద్భక్తుడు గుర్తిస్తాడు. తత్త్వదృష్ట, లేక బ్రహ్మజ్ఞానీ యైన గురువుగూడ శిష్యుణ్ణి ఆ భగవంతుని రూపంగానే దర్శిస్తాడు. అటువంటి గురుని ప్రాశస్త్యం తెలిపేందుకే కృష్ణుడు ఆత్మజ్ఞానులను సేవించాలన్నాడు" అని చెప్పారు బాబా.

నానాసాహెబ్ ఆ శ్లోకం వల్లిస్తున్నప్పుడే సాయి అలా అడగడానికి కారణమేమిటి? సకలశాస్త్రసారమైన భగవద్గీత రూపొందడానికి కారణం గూడ అర్జునుడు ఈ శ్లోకంలో చెప్పినట్లే శ్రీకృష్ణుణ్ణి పరిప్రశ్నలు వేయడమే. నానాసాహెబ్‌ను అనేకరీతుల ప్రశ్నించి పరిప్రశ్న చేయడమెలానో సాయి తెలిపారు. ఆ శ్లోకంలో చెప్పినట్లు, నానాకు తత్త్వదర్శియైన గురువు లభించారు. కాని అతడు ఆ శ్లోకం వల్లిస్తూగూడ పరిప్రశ్న, సేవల తత్త్వం తెలుసుకోకుండానే వ్యర్థంగా వల్లిస్తున్నాడు. వాచా బోధించినది చాలనప్పుడు అతీతమైన విశ్వరూపదర్శనం వంటి దివ్యానుభూతిని ప్రసాదించ గలవాడే సద్గురువు. అట్టివారిని సేవించక తప్పదని, అలాగాక దేవతలను మాత్రమే ఉపాసించేవారు ఆ పుణ్య మున్నంతకాలం ఆయా లోకాలలో వుండి ఆ పుణ్యమైపోగానే యీ లోకంలో మరలా జన్మిస్తారనీ శ్రీకృష్ణుడు చెప్పాడు. సాక్షాత్తూ త్రిమూర్తులు, పరబ్రహ్మము తానేయైన గురుని సేవిస్తే ముక్తి లభిస్తుంది. వైద్యం నేర్వకుండానే మందులిచ్చేవాడు, ఆత్మజ్ఞానం లేకనే శిష్యసేకరణ చేసేవాడు, అట్టి కపట గురువునాశ్రయించినవారూ భ్రష్టులవుతారని శాస్త్రం. 'గు' అంటే అజ్ఞానమనే చీకటి. 'రు' అంటే దానిని పోగొట్టేవాడని అర్థం. వెలుగే చీకటిని పోగొట్టగలదు. చీకటిని వెలుగుగా భావించి దానిని పోగొట్టుకోగలిగితే యిక వెలుగెందుకు? మానవమాత్రులను పరబ్రహ్మ స్వరూపులుగా దర్శించడం బ్రహ్మజ్ఞానికి మాత్రమే వీలవుతుంది గాని, అజ్ఞుడైన సామాన్యునికెలా సాధ్యం? అందుకే

సప్తశృంగీదేవి, శ్రీమన్నారాయణుడు, తమ భక్తులను సాయి వద్దకు పంపారు. అందుకే వేదఋషులు, శ్రీకృష్ణుడు మొదలుకొని సాయివరకూ మహాత్ములందరూ గురువునే సేవించాలన్నారు.

కాని, యీ ప్రపంచంలోని సాధువులందరిలో, ఎవరు బ్రహ్మజ్ఞానులో, ఎవరు కారో ఎలా తెలుసుకోవాలి? మనకై మనమే నిర్ణయించుకుంటే యెలా వుంటుందో, యిందుకు సరియైన మార్గమేదో సాయి తెలిపారు. కుశాభావు అనే టీచరు ఒక సాధువును ఆశ్రయిస్తే ఆయనొక మంత్రం నేర్పాడు. దానివలన అతడు కోరగానే పండ్లు, మిఠాయిల వంటి వస్తువులు చిత్రమైన రీతిన అతని చేతులోకొచ్చేవి. అదిచూచి జనం అతని చుట్టూ చేరసాగారు. కొందరు అతనిని రకరకాలుగా విమర్శించసాగారు. వీరిని దండించడానికి తగిన మంత్రాలు నేర్పమని అతడు ఆ సాధువును వేధించసాగాడు. ఆ సాధువు, అతనిని యిక నుంచి సాయిబాబాను ఆశ్రయించమని చెప్పి, హిమాలయాలకు వెళ్ళిపోయాడు. కుశాభావు 1909లో శిరిడీ చేరాడుగాని బాబా అతనిని మశీదులోనికి రానీయక, అతడు ఆ శక్తులను గోదావరి నదిలో విడిస్తేగాని రానివ్వనని పట్టుబట్టారు. ఆ మంత్రశక్తితో అతడు వేరొక చోటునుండి వస్తువులను తెప్పిస్తున్నాడని, కనుక అవి అమాయకులను అపవిత్రం చేస్తున్న దొంగసొత్తనీ ఆయన చెప్పారు. అతనిని చూచినవారికి గూడ అటువంటి శక్తులపై వ్యామోహం కల్గుతుంది గదా? ఇలా అతనిని, సాటివారినీ అపవిత్రం చేస్తున్న ఆ శక్తులను అతడు విడిచిపెట్టాలని ఆయన చెప్పారు. చివరకు అతడు దానిని గోదావరిలో విడచివచ్చాక, బాబా అతనిచేత రోజూ శ్రీ సమర్థ రామదాసస్వామి వ్రాసిన "దాసబోధ" చదివించారు. అతనిచేత 'శ్రీగురుచరిత్ర' 108 పారాయణలు చేయించాకనే అతనిని యీక్రింది రీతిన అనుగ్రహించారు. ఒక ఏకాదశినాడు కుశాభావు ఉపవసిస్తున్నాడు. అతడు బాబాను దర్శించి, ప్రసంగవశాత్తు, పూర్వం ఋషులు కందమూలాలు తినేవారని చెప్పాడు. సాయి ఆ పదాన్ని "కాంద" (ఉల్లిగడ్డ) అని చమత్కరించి, అతనికి కొన్ని ఉల్లిగడ్డలిచ్చి తినమన్నారు. అతడు దిక్కు తోచక, ఆయన తింటే తానూ తింటానన్నాడు. అప్పుడు యిద్దరూ చెరికొన్నీ తిన్నారు. అప్పుడు సాయి కొందరు భక్తులను పిలిచి, "ఈ సద్బ్రాహ్మణుడు చూడండి, ఏకాదశినాడు ఉల్లి తిన్నాడు!' అని చెప్పి గేలిచేశారు. అతడు, తనను బాబా ఆదేశిస్తేనే ఉల్లి తిన్నానని, ఆయనగూడా తిన్నారనీ చెప్పాడు. బాబా అంగీకరించక, తాము తిన్నది కక్కి చూపారు. అందులో కందమూలాల ముక్కలే వున్నాయిగాని, మచ్చుకైనా ఉల్లిలేదు. కుశాభావు అదే మంచి అవకాశమని తలచి ఆయన కక్కినది మహా ప్రసాదమైన గురూచ్ఛిష్టంగా (గురువు ఎంగిలి) తినేశాడు. బాబా అతనిని తిట్టి, కొట్టి వారించాలని చూచారుగాని అతడు వినలేదు. అతడి భక్తిశ్రద్ధలకు ఆయన కన్నులవెంట ఆనందభాష్పాలు కారాయి. ఆయన అతనిని ఆశీర్వదించారు. అతడు మంచి గురుభక్తుడయ్యాడు.

ఈ లీలద్వారా లోకానికి "శ్రీగురుచరిత్ర" యొక్క ప్రాశస్త్యం తెల్పారు బాబా. దాని పారాయణ కుశాభావును పవిత్రుణ్ణిచేసి సద్గురుకృపకు పాత్రుణ్ణి చేసింది. సాఠేకు, హేమాద్పంత్‌కూ గూడ అట్టి శ్రేయస్సునే ప్రసాదించింది. శ్రీవాసుదేవానంద సరస్వతీ, రంగావధూత, నానే మహరాజ్‌వంటి వారెందరికో యీ గ్రంథ పారాయణమే వారు ఆశ్రయించదగిన గురువును గురించి తెల్పి, వారిని గురుకృపకు పాత్రులను చేసి, మహాత్ములుగా రూపొందించింది. పూర్ణులైన గురువును ఎలా అన్వేషించి, ఆశ్రయించాలో చెప్పిన గ్రంథమదొక్కటే. రెండవ దత్తావతారమైన శ్రీ నృసింహ సరస్వతీస్వామి అంతర్హితులయ్యాక, వారి దివ్యలీలలు విని నామధారకుడు ఆయన సాక్షాత్కారం కోసం తపిస్తూ గాణ్గాపురం చేరాడు. అతనికక్కడ సిద్ధుడనే యోగిరూపంలో శ్రీ నృసింహ సరస్వతి స్వప్న దర్శనమిచ్చారు. నామధారకుడు నిద్రలేవగానే ఆ సిద్ధయోగియే ప్రత్యక్ష దర్శనమిచ్చి అతనికి "శ్రీ గురుచరిత్ర" చెప్పాడు.

"శ్రీగురుచరిత్ర"కు అంత ప్రాముఖ్యమివ్వడం ద్వారా లోకానికి శ్రీసాయి ఎన్నో ఆధ్యాత్మ రహస్యాలు సూచనగా

తెల్పడమే జరిగింది. సాధకులు నామధారకునిలా, మొదట శ్రీ దత్తావతారమైన సద్గురుని లీలలు వింటే వారిని దర్శించి ఆశ్రయించాలన్న బలమైన కోరిక కలుగుతుంది. అతడు సహజంగానే ఆ లీలలను గురించి ఆయన గురించి చింతనచేస్తూ ఆయన కోసం తపిస్తాడు. అప్పుడాయన ఏదో రూపంలో స్వప్నదర్శనమిస్తారు. తర్వాత ప్రత్యక్షదర్శనమిచ్చి అనుగ్రహిస్తారు. పైన చెప్పినట్లు ఆ మహనీయులందరి అనుభవమూ యిలానే వున్నది. సూఫీ సంప్రదాయంలోగూడ సాధకుడు మొదట పరమపదించిన ఒక మహాత్ముని ఆశ్రయించి, తానాశ్రయించవలసిన గురువెవరో తెల్పమని ప్రార్థిస్తాడు. సకాలంలో ఆ మహనీయుడా విషయం వారికి స్వప్నంలో చెబుతారు. ఇది ఉత్తమమైన మార్గం కనుకనే శ్రీ సాయి దానికంత ప్రాధాన్యమిచ్చారు. ఆయనగూడ వెనుక జన్మలలో తమను సేవించిన వారికి ముందుగా స్వప్న దర్శనమిచ్చాకనే వారిని శిరిడీలో ప్రత్యక్షంగా తమచెంతకు రప్పించుకున్నారని "శ్రీసాయి సందర్శనము" అనే అధ్యాయంలో గమనించాము. అందుకే శ్రీసాయిభక్తులకు "శ్రీగురుచరిత్ర" పారాయణ ఎంతో ముఖ్యం.

అలానే ఒక సాధకుడు యోగమభ్యసిస్తూవుంటే దూరదృష్టి లభించింది. దూరాన తన యంత్రశాల తగల బడుతూ వుంటే అతడు ధ్యానంలో చూడగలిగాడు. అతడు శిరిడీ వచ్చినపుడు బాబా, "ఎందుకా వేశ్యప్రదర్శనలను చూస్తావు? నేనెప్పుడూ అలా చేయను. అదెవరికీ తగదు" అన్నారు. ఆత్మజ్ఞానంతో లభించే శక్తులు లోకహితం చేస్తాయి. ఇటువంటి శక్తులు సాధకులను, ప్రజలనుగూడ ప్రక్కదారి పట్టిస్తాయి. కోరి శక్తులను సాధించి, లోకాన్ని మెప్పించడం వేశ్య వృత్తి. అట్టి సాధకుని భక్తి ఆ భగవంతనిపట్ల వ్యభిచరించి అతనికి, లోకానికీ గూడ కీడు చేస్తుంది.

సామాన్య బోధకునిలాగా సాయిబాబా 'మాయ', 'బ్రహ్మము' మొ॥న పెద్ద పెద్ద మాటలు వల్లించలేదు. సామాన్యులకవి నిరుపయోగమేగాక, అహాన్ని పెంచుతాయిగూడ. సామాన్యంగా ఎంతో చిన్నవనిపించే విషయాలే చాలా పెద్దవి. వాటిని చక్కదిద్దుకొని, నిజమైన మానవత్వాన్ని అలవరచుకొనడమే ధర్మమని, దాన్ని సాధించకనే సాధన ప్రారంభిస్తే ఇహపరాలు రెండూ చెడతాయనీ ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి. వెనుక సాయిచెప్పిన మామిడిపూతవలె మనం సద్గురుభక్తి నుండి మధ్యలో రాలిపోకుండాను, మరుజన్మలో దుఃఖం కలుగకుండానూ వారి ఉపదేశాలు ఉపకరిస్తాయి. సాయి భక్తులనెలా హెచ్చరించేవారో చూద్దాము: ఒకసారి అంజన్వేల్ నుండి మధురదాస్ అనే భక్తుడువచ్చి, సగుణమేరునాయక్ ఇంట్లో దిగాడు. ఒకరోజు వాళ్ళిద్దరూ సాటివారి దోషాల గురించే మాట్లాడుకున్నారు. తర్వాత మధురదాసు మశీదుకు వెళ్ళగానే బాబా చికాకుగా, "ఏమిటి సగుణ్ అంటున్నాడు?" అన్నారు. తమ సంభాషణ బాబాకెంతో బాధ కలిగించిందని అతడు గ్రహించాడు. దుష్ప్రచారము, దానిని ఆసక్తితో వినడమేగదా దుస్సాంగత్యమంటే? అది నిజమైనా, అబద్ధమైనా సర్వమూ సాయిరూపమన్న వివేకాన్ని పాడుచేసి, పుణ్యమపహరించి, హృదయాన్ని కలుషితం చేస్తుంది. అలాగే ఒకరోజు వసతిగృహంలో ఒకడు వేరొకరి గురించి అపవాదులు కల్పించి, వారి మనస్సులు విరిచేయాలని తలచాడు. తర్వాత అతడు బాబా లెండీకి వెళ్తుంటే ఎదురయ్యాడు. అపుడాయన, మలం తింటున్న ఒక పందిని అతనికి చూపి, "అది మలమెంత ప్రీతిగా తింటోందో చూచావా? సాటివారి గురించి అపవాదులు కల్పించడమలాంటిదే! క్రమంగా మనలను సాటివారు ఏవగించుకుంటారు. అంతేకాదు, అలాచేస్తే మనం కష్టపడి సంపాదించుకున్న పుణ్యమంతా వారికి, వారి పాపం మనకూ వస్తాయి. ఇక శిరిడీ యాత్రవలనగూడ మనకేమి ప్రయోజనం?" అన్నారు. అందుకే క్రీస్తు, "ఇతరుల దోషాలెంచకు; ఎంచితే భగవంతుడు నీ లోపాలెంచుతాడు. (క్షమించడు)" అని, సాటివారినెంత కొద్దిగా నిందించినా నరకంలో శిక్ష తప్పదనీ చెప్పాడు. "ప్రక్కవాడి కంట్లో నలుసు తీసేముందు, నీ కంటిలోని (తప్పులెంచే లక్షణమనే)

దూలాన్ని తొలగించుకో!" అన్నాడు.

ఇతరులను మనస్సులో గూడ ద్వేషించకూడదు. హత్య, శతృత్వము, ఋణము - వీటి ఫలితమనుభవించక తప్పదన్నారు సాయి. ఒకరోజొక భక్తుడు రవ్వకేసరి ప్రసాదంగా పంచుతున్నాడు. వేరొక భక్తునితో, "ప్రసాదం తీసుకున్నావా?" అన్నారు బాబా. అతడికి, తనకూ భేదాభిప్రాయాలుండటం వల్ల ప్రసాదం తీసుకోలేదన్నాడతడు. అపుడు సాయి, 'ఇచ్చేది, యివ్వబడేది, పుచ్చుకొనేది యెవరు? అంతా ఒక్కటే. ఎవరినీ శతృవులుగా తలచవద్దు' అన్నారు. ద్వేషమెంత ప్రమాదకరమో! చెన్నబసప్ప - వీరభద్రప్ప అనే పాము - కప్పలకు పూర్వజన్మలో సాయిసన్నిధి లభించినా, పరస్పర ద్వేషంవలన హీనజన్మలు లభించాయి.

పై రెండు బలహీనతలకూ భిన్నమయిన మరొకదానిని గురించి ఒకసారి సాయి నానాచందోర్కరుతో యిలా చెప్పారు; 'యాచించిన వారికి శక్తి కొద్దీ సమర్పించు. ఇంకా అడిగితే వీలుకాదని సౌమ్యంగా చెప్పు. కోపించవద్దు.' కొంత కాలానికి కల్యాణ్‌లో అతనింటికి ఒక బిచ్చగత్తె వచ్చి, పెట్టినదానితో తృప్తి చెందక ఇంకా కావాలని పట్టుబట్టింది. అతను సేవకునితో, "పెట్టింది తీసుకు పొమ్మను, లేకుంటే మెడపట్టి గెంటు!" అన్నాడు. ఆమె వెళ్ళిపోయింది. తర్వాత అతడు శిరిడీ వెళ్ళినపుడు సాయి అతనితో పలుకలేదు. కారణమడిగితే, "నా మాట విననివారితో నాకేం పని? ఆ బిచ్చగత్తెను, అధికంగా భిక్షకోరినందుకు మెడపట్టి గెంటమంటివే? ఆమె వాకిట్లో కూర్చుంటే నీదేం పోయింది' ' అన్నారు. అంతేగాదు, ఆవేశమెన్నడూ తగదని సాయి ఎంత చమత్కారంగా బోధించారో! ఆయన ఒక భక్తుని దక్షిణ అడిగారు. అతడు తన వద్ద పైకం లేదన్నాడు. అయినా ప్రతి 10, 15 ని॥లకు సాయి అతనిని తిరిగి తిరిగి అడిగారు. చివరకతడు విసిగిపోయి, "నా వద్ద డబ్బు లేదంటూంటే!" అని గొంతు చించుకున్నాడు. సాయి కొంటెగా నవ్వి, "లేకపోతే లేదని నెమ్మదిగా చెప్పు. అదీగాకుంటే ఊరుకో, అరుస్తావెందుకు?" అన్నారు.

కోపతాపాలన్నింటికీ 'నాది' అనే మమకారం మూలకారణం. ఒకరోజు బాగ్‌చంద్ మార్వాడీ రాగానే అతనిని గూర్చి భక్తులతో సాయి అన్నారు: "ఇతడు తన గడ్డివామి అంటుకుందని, దానిని కాపాడమనీ కోరుతున్నాడు. చావు-పుట్టుకలు, లాభనష్టాలు దైవాధీనాలు. మూఢులు ఈ విషయం మరచి లాభిస్తే సంతోషించి, నష్టమొస్తే ఏడుస్తారు. 'ఇది నాది' అంటారు. గడ్డివామి మార్వాడీది కాదు, అది గడ్డేకానీ అతని శరీరంకూడ కాదుగదా! భూమి, వర్షము, ఎండలవలన విత్తుల నుండి పెరిగింది గనుక వాటికి చెందినదే. ఆ మూడింటిలోనూ అగ్ని వున్నది. అదే ఈ గడ్డివామిని కాల్చింది. భగవంతుడు ఒకచేతితో యిస్తాడు, మరోచేతితో తీసుకుంటాడు. " అని తిరిగి మార్వాడీతో, "ఈ నష్టం మరలా సర్దుకుంటుందిలే, పో!" అన్నారు.

నిత్యజీవితంలో మనస్సు, ఇంద్రియాలను ఎలా నిగ్రహించుకోవచ్చో సాయి తెల్పారు. ఒకసారి ముస్లిము స్త్రీలిద్దరు బురఖాలు ధరించి దర్శనానికి వచ్చారు. నానా లేచి బయటకు వెళ్ళబోతే బాబా, "నీవిక్కడే వుండు, వాళ్ళు రాదల్చుకుంటే వస్తారు" అన్నారు. వాళ్ళు ముసుగులు తొలగించుకొని బాబా దర్శనం చేసుకున్నారు. వారిలో ఒక యువతిని చూడగానే నానా మనస్సు చలించింది. వెంటనే బాబా అతని తలపై చరచారు. అతడు సిగ్గుతో తలవంచుకోగానే ఆయన, "నానా, నీవు మానవుడవు గనుక ఇంద్రియాలు విషయాలపై ప్రసరించినపుడు కోరిక కలుగుతుంది. కాని అందమైన దేవాలయాలెన్ని లేవు? మనం బాహ్యసౌందర్యాన్ని గాక లోనున్న దైవాన్ని చూడాలి. ఆ సౌందర్యాన్ని కల్పించిన దైవలీలలను చూడాలి. ఇదెప్పుడూ మరువకు" అన్నారు.

సాయి ఒకరోజు మధ్యాహ్నం ఒక నిచ్చెన తెప్పించి, వామన్ గోండ్కర్ అనే భక్తునింటి పైకెక్కి, రాధాకృష్ణ ఆయి యింటిమీదుగా నడచి అవతలివైపుకు దిగారు. రాధాకృష్ణఆయీని మలేరియా జ్వరంనుండి అలా రక్షించారని

భక్తులు తలచారు. అపుడు బాబా ఆ నిచ్చెన తెచ్చినవాడికి రూ. 2/-లు యిచ్చారు. అంతెందుకిచ్చారని భక్తులడిగితే, "ఏ సేవకైనా ఉదారంగా ప్రతిఫలమివ్వాలి. ఉచితంగా పొందరాదు" అన్నారు. నేటి విద్యావంతులలో గూడ ఎక్కువమంది నేర్చుకోవలసిన బోధ యిది.

ఇటువంటి నైతికసూత్రాలు నిత్యజీవితంలో ఆచరించాలని వినినవారిలో ఎక్కువమంది చేసే పొరబాటు- సాటివారు ఎంతవరకు పాటిస్తున్నారో గమనించి వారిని విమర్శించడం. **ధర్మాచరణలో ఆత్మవిమర్శ ఒక్కటే తగినది.** ధర్మమెంతో సూక్ష్మమైనదని ఎరుగరు. ఒకరోజు ఒకడు డబ్బుకావాలని బాబానడిగాడు. ఆయన లేదన్నారు. కాని ఆయన జేబులో డబ్బున్నదని శ్యామాకు తెలుసు. ఆ వ్యక్తి వెళ్ళగానే శ్యామా, "సాయి, నీవు సత్యాన్ని, వైరాగ్యాన్నీ అవలంబించిన ఫకీరువు గదా! మాకు నీతులు బోధించి నీవబద్ధం చెప్పావేమి?" అన్నాడు. డబ్బివ్వడం అతడికి శ్రేయస్కరం కాదు. చెబితే వినడు, కనుక అతని మేలు కోసమే అలా చెప్పాను" అని సాయి శాంతంగా సమాధాన మిచ్చారు. శ్రేయస్సు చేకూర్చే అసత్యమే సత్యమని, శ్రేయస్సును పాడుచేసే సత్యమే అసత్యమనీ ఆర్షధర్మ సూత్రంగూడ.

దాసగణు 1910లో శిరిడీ వెళుతూండగా దారిలో ఒకవ్యక్తి బాబాను నిందించాడు. అంతటితో దాసగణు మనస్సు చలించింది. శిరిడీ చేరగానే నూల్కర్ అనే భక్తుడు అతనిని సమాధానపరచి ఆరతికి తీసుకువెళ్ళాడు. అపుడు సాయి, "గణూ, నీవు నూల్కర్‌ను హృదయపూర్వకంగా సేవించాలి. అందులో న్యూనతేమీ లేదు." అన్నారు. అతడు సేవించబోతే నూల్కర్, 'బాబా నీకేమైనా చెప్పనీ, ఏ ప్రత్యేకతాలేని నన్నిలా యిబ్బంది పెట్టకు" అన్నాడు నూల్కర్. దాసగణు సాయివద్దకు వెళ్ళి, "మీ ఆదేశం నాకర్థం కాలేదు." అన్నాడు. సాయి ఉగ్రులై, **"అనుభవమనేది ఎద్దులకు రాదు!"** అన్నారు. బాబా చెప్పినది అర్థమైందాకా వెళ్ళకూడదనుకున్నాడు గణు. సాయి వెంటనే, "అదే సరైన పద్ధతి!" అన్నారు. తర్వాత దాసగణు యింటికి వెళ్ళడానికి శ్యామా అనుమతి అడిగితే, "వాణ్ణి కుక్కలా పడుండనీ నేను, వాడు తేల్చవలసిన లెక్కలున్నాయి" అన్నారు సాయి. సద్గురుడైన సాయిపట్ల దాసగణుకు భక్తి స్థిరపడేలాగ సహకరించడంలో మరే మానవుడూ చేయలేనంతటి సహాయం చేసిన నూల్కర్ సాయి అనుగ్రహానికి ప్రతీక. కనుకనే అతడు పూజ్యుడు. అతనిని సేవిస్తే దాసగణుకు అహంకారమంతరిస్తుంది. అయితే "నీ గురువు నూల్కర్" అని మాత్రం సాయి దాసగణుకు చెప్పలేదు. అతడు చేసిన మేలును గుర్తించి కృతజ్ఞత కల్గివుండడం ఎంతో ముఖ్యమని సాయిబోధ!

ఒక భక్తుడు శిరిడీ వెడుతూంటే, అతనితో సాటి ప్రయాణీకుడు మానవుడైన సాయిని కొలవడం వ్యర్థమని వాదించాడు. ఆ భక్తుని మనస్సు కలత చెందింది. అతడు మశీదు చేరగానే శ్యామాతో, "ఇతనికేదైనా మంచి మాటలు చెప్పు!" అన్నారు సాయి. అపుడు శ్యామా అతనిని బయటకు తీసుకువెళ్ళి, "సాయి గూర్చి యితరులన్నవి పట్టించుకోవద్దు. నీ అనుభవాన్నే అంటిపెట్టుకో!" అని చెప్పాడు. తర్వాత వారిద్దరూ మశీదులోకి రాగానే సాయి అతనితో, "నువ్వు శ్యామా చెప్పినట్లు చెయ్యి, మేలు జరుగుతుంది" అన్నారు.

మన సహాయం ఎవరైనా అర్థిస్తే, తప్పక చేయడంగాని, లేక చేయించడం గాని మన ధర్మమన్నారు సాయి. వారుగూడ యీ ధర్మం పాటించారు. ఒకప్పుడొక రైతు తన పొలంలో బావికై అర్జీ పెట్టుకుంటే జిల్లా కలెక్టరు త్రోసిపుచ్చాడు. అతడు బాబాతో చెప్పుకుంటే ఆయన, "నీవు నానా చందోర్కర్‌తో కలసి కణీత్కర్‌తో మాట్లాడు. నేను నానాతో చెబుతాను" అన్నారు. తర్వాత నానా సహకారంవలన కలెక్టరు అది మంజూరు చేసాడు. అతడు బావి త్రవ్వించుకొని, పంటలొచ్చాక తన అప్పులన్నీ తీర్చుకున్నాడు.

★ శుక్రవారం పారాయణ సమాప్తము ★